# అట్టహాసంగా భూమా నాగరాగిణి ప్రమాణ స్వీకారం

- ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ - భారీగా తరలివచ్చిన కూటమి నాయకులు
- నష్టాల్లో ఉన్న మార్కెట్‌యార్డ్‌ను లాభాల్లోకి తీసుకొస్తా: మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి




ప్రమాణస్వీకారం చేస్తున్న మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ భూమా నాగరాగిణి, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
తాడిపత్రి మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్‌గా భూమా నాగరాగిణి సోమవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ముందుగా పట్టణంలోని అమ్మవారిశాల నుండి ఆర్యవైశ్య సంఘం సభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్ మీదుగా భారీ ర్యాలీగా వెళ్ళి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించిన అనంతరం మార్కెట్ యార్డ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్‌గా జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమా నాగరాగిణి ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ చైర్మన్‌గా పరిమి శ్రీహరితో పాటు కమిటీ బోర్డు మెంబర్లు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నష్టాల్లో వున్న మార్కెట్‌యార్డును లాభాల్లోకి తీసుకొస్తామన్నారు. కొత్త కమిటీ మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ భూమా నాగరాగిణి మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ పదవిని అప్పగించిన ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలో మార్కెట్ యార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## డిజిపిని మర్యాదపూర్వకంగా కలిసిన కాకర్ల

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



డిజిపిని కలిసిన కాకర్ల రంగనాథ్

తాడిపత్రి పట్టణానికి చెందిన టిడిపి నాయకుడు కాకర్ల రంగనాథ్ సోమవారం కర్ణాటక ఏడిడిఎల్ డిజిపిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందచేశారు. అనంతరం పలు విషయాలపై చర్చించినట్లు తెలిసింది.

## చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పవర్ జాక్ నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న పవర్‌జాక్ నాయకులు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
చలో విజయవాడ కార్యక్రమాన్ని సోమవారం పవర్‌జాక్ నాయకులు విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పవర్ జాక్ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు గత 25 సంవత్సరాల నుండి సంస్థను నమ్ముకుని చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న వారిని ఇంతవరకు యాజమాన్యం గుర్తించక పోవడం దురదృష్టకరమన్నారు. వారికి తక్షణమే యాజమాన్యం గుర్తించి వారిని సంస్థలో విలీనం చేసి సంస్థ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. జెఎల్‌యమ్ గ్రేడ్ 2 కు ప్రమోషన్ ఇవ్వాలని, ఫెండింగులో వున్న 4 డిఏ తక్షణమే ఇవ్వాలని, సంస్థలో వున్న దీర్ఘకాళిక సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకపోతే ఈ నెల 15వతేదీ ఉదయం 06.00 గంటలకు సమ్మెలోకి వెళతామని పవర్ జాక్ నాయకులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పవర్ జాక్ నాయకులు కృష్ణయ్య, రాఘవరెడ్డి, ప్రహ్లాద, రమేష్, నాగార్జున, కట్ట నాగరాజు, బాలకాశి, పావురాల శీనయ్య, అమర్నాథ్‌రెడ్డి, ఎండి వెంకటేష్, నజీర్, ఉపేంద్ర, మురళి, రాజా, అమీర్, నాగరాజు, చిన్న, లక్ష్మన్న, ఈశ్వరయ్య, శరత్, కుళ్లాయి, వివేక్, జెపి, రాజా, బాబు, సంపత్, ఎలీషా, పవన్, కార్మికులు పాల్గొన్నారు.

## సమ్మెకు సంఘీభావం తెలిపిన పిహెచ్‌సి సిబ్బంది



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

**యల్లనూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
యల్లనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న డాక్టర్లు తమ న్యాయమైన హక్కుల కోసం చేస్తున్న సమ్మెకు పిహెచ్‌సి సిబ్బంది తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ మధుకుమార్. హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వర్‌రెడ్డి. సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక పుష్పాలంకరణలో శ్రీబుగ్గరామలింగేశ్వరుడు




బుగ్గరామలింగేశ్వరస్వామిని రాజరాజేశ్వరిదేవి అలంకరించిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్, కమిటీ సభ్యులు రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతస్థాయి సమావేశానికి భారీగా తరలివెళ్లిన టిడిపి నేతలు



ర్యాలీగా వెళుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
తాడిపత్రి పట్టణంలోని పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి పట్టణంలోని 25వవార్డు కౌన్సిలర్ రసూల్‌బీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బైకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు బూత్ ఇన్‌చార్జ్ యూనిస్, యూనిట్ కో కన్వీనర్ బుజ్జి, బూత్ ఇన్‌చార్జ్ రామకృష్ణ, రాము, 25వార్డు టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, అబ్దుల్లా, బాల, చిన్నస్వామి, రమణ, రంగనాయకులు, పెద్దయ్య, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆమరణ నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపిన భారతీయ భీమ్ సేన



సంఘీభావం తెలిపేందుకు వెళుతున్న నాయకులు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఫాదర్ విన్సెంట్‌ఫెరర్ విగ్రహం వద్ద చేపట్టిన సేవ్ ఆర్డీటి సేవ్ అనంత ఆమరణ నిరాహార దీక్ష కార్యక్రమానికి తాడిపత్రి భారతీయ భీమ్ సేన నాయకులు సంఘీభావం తెలిపారు. పెద్దఎత్తున నాయకులు జిల్లా కేంద్రానికి తరలివెళ్లి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారికి తమ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పేచెర్ల ప్రసాద్, శంకర్, వి.మద్దిలేటి, హరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



ప్రమాదంలో మృతి చెందిన కుళ్లాయప్ప

తాడిపత్రి పట్టణ సమీపం లోని చుక్కలూరు రోడ్డులో వున్న సిద్ధార్థ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దొడ్డుకట్టెల కుళ్లాయప్ప (38) మృతి చెందాడు. వివరాలు ఇలా వున్నాయి. యల్లనూరుకు చెందిన కుళ్లాయప్ప ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. సోమవారం చుక్కలూరు రోడ్డులోని సిద్ధార్థ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద ఆటో యు టర్న్ తీసుకుంటున్న సమయంలో గుర్తు తెలియని టిప్పర్ ఢీ కొంది. దీంతో ఆటోలో వున్న కుళ్లాయప్ప కింద పడిపోగా చుట్టపక్కల వారు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే కుళ్లాయప్ప మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
జిఎస్‌టి తగ్గింపుపై తాడిపత్రిలో సోమవారం ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిఎస్‌టిలో వచ్చిన సంస్కరణల ఫలితంగా సామాన్యులకు నిత్యావసరవస్తువులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వివిధ రకాల వస్తువులపైన, పాల ఉత్పత్తులు, వివిధ రకాల ఔషధాలపైన జిఎస్‌టి తగ్గించిన ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలసీతారామన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ప్రజలకు జిఎస్‌టిలో తగ్గిన రేట్లను వివరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ కమీషనర్ శివ రామకృష్ణ, సేల్‌ట్యాక్స్ అధికారి, లేబర్ ఆఫీసర్, రిటైల్ మర్చంట్ ప్రెసిడెంట్ కుప్పం రత్నమయ్య, ప్రసాదు, గంగారం, బాబు, కుల్లూరు శేషఫణి, గుడూరు ప్రభాకర్, ప్రవీణ్, రామాంజనేయులు,వంకదారి నాగరాజు,అలవల ప్రసాదులు పాల్గొన్నారు. ముందుగా పాత మున్సిపల్ కార్యాలయం నుండి బైక్ ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుని ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఘనంగా శ్రీరంగనాథస్వామి కళ్యాణం

**తాడిపత్రిరూరల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
మండలంలోని ఆలూరుకోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కళ్యాణం సోమవారం ఘనంగా జరిగింది. ఆలూరు గ్రామానికి చెందిన శివశంకర్ కుటుంబసభ్యులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని జరిపించారు.

ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ, సుగంధపుష్పాలతో శాస్త్రోక్తంగా వేదపండితులు సుబ్బారావు, రంగనాథశర్మలు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామివారి కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారి కళ్యాణాన్ని వీక్షించారు. గోవిందనామస్మరణతో ఆలయం మారుమ్రోగింది. హాజరైన భక్తులు నిత్యాన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఒగేటి రంగనాయకులు, ఆలూరు గ్రామపెద్ద తిరుపాల్‌రెడ్డి, ఆలయ ఇఒ రామాంజనేయులు, సిబ్బంది కాశీ, భక్తులు పాల్గొన్నారు.

## మసీదు నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

**కదిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మసీదు ఏ ఉస్మాని గని కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం మసీదు నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొని మసీదు నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. అనంతరం ముస్లిం మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక దువాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట కోత ప్రయోగాలపై శిక్షణ



పంట కోత ప్రయోగాలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

**నంబులపూలకుంట, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
మండలంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం మండల ఏఓ వి.లోకేశ్వర రెడ్డి, సహాయ గణాంక అధికారి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖరీఫ్ 2025 సంబంధించి సహాయ గణాంక అధికారి మాట్లాడుతూ ఈ పంట కోత ప్రయోగాలు చేయడం వలన దిగుబడి ఆధారిత భీమా పంటలు కంది, వరి, మొక్కజొన్న, రాగి, ఆముదం మొదలగు పంటలకు పంటకోత ప్రయోగాల వలనే రైతులకు భీమా వర్తిస్తుందని వారు తెలియజేశారు. ఇటువంటి కచ్చితత్వమైన గణాంక పద్ధతుల వలన మన దేశ జిడిపి, విదేశీ మారక విలువలలో, దేశీయ ఉత్పత్తుల ఎగుమతి దిగుమతులలో, ధాన్యం సేకరణలో ఇటువంటి గణాంకాల పాత్ర ఎంతో దోహదపడతాయని వారు తెలియజేశారు. ఏఓ మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ 2025కు సంబంధించి వేరుశనగ పంట యొక్క పంట కోత ప్రయోగాలు అన్ని గ్రామాలలో పూర్తి చేసామని వారు తెలియజేశారు. కంది పంట సంబంధించి పంట కోత ప్రయోగాలు జనవరి మాసంలోపు పూర్తి చేస్తామని వారు తెలిపారు. చివరిగా శిక్షణ అనంతరం వేరుశనగ సాగుచేసిన రైతు భాస్కర్ రెడ్డి పొలంలో పంట కోత ప్రయోగం చేసే విధానాన్ని రైతు సేవా కేంద్రం సిబ్బందికి ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే ఈ పంట నమోదు అనేది ఈనెల 25 లోపు పూర్తి చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక యువ రైతు ఆత్మహత్య

**నంబులపూలకుంట, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



ఆత్మహత్య చేసుకున్న యువ రైతు పశువుల సోమశేఖర్

ఎన్‌పికుంట మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన వెంకటన్న కుమారుడు పశువుల సోమశేఖర (24) అను వ్యక్తి భూమి కౌలుకు తీసుకొని పంటలు పండించేవాడు. గత మూడు సంవత్సరముల నుంచి వ్యవసాయం చేస్తున్నా పంటలు సరిగా పవండక పెట్టుబడి పెట్టిన డబ్బులు తిరిగి రాక అప్పులు చేసి అప్పు చెల్లించలేక నిన్న సోమశేఖర్ భార్య తన పుట్టింటికి వాళ్ళ అమ్మను చూడడానికి వెళ్ళగా ఆదివారం రాత్రి సోమశేఖర తన ఉన్న ఇంటిలో ఉరి వేసుకొని మృతి చెందాడు. సోమవారం ఉదయం 6 గంటలకు ఇంటికి పోయి భార్య చూడగా ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడు.

## పారిశుద్ధ్య కార్మికులు రూ 18 వేలు వేతనం ఇవ్వాలి

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



ఎంపీడిఓకు వినతిపత్రం ఇస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు

గ్రామ పంచాయితీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ 18 వేలు వేతనం ఇవ్వాలని ఐఎఫ్‌టియు కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెలుపల సోమవారం ఎంపీడిఓ శివరాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. అంతే కాకుండా శానిటైజర్లు, గ్లౌజులు, సబ్బులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజినేయులు, రమణ, రామునాయుడుతో పాటు పారిశుద్ధ్య కార్మికులు అంజినప్ప, భాగ్యమ్మ, ఓబులమ్మ, సాలెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ మద్యంపై నిఘా ఉంచాలి



వినతిపత్రం ఇస్తున్న ఆర్సీపి నాయకులు

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మండలంలో నకిలీ మద్యం వి క్రయాలు జోరుగా సాగుతున్నాయని వాటిపై నిఘా ఉంచాలని ఆర్సీపి నాయకులు సోమవారం తహశీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. అంతే కాకుండా గ్రామగ్రామన బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జోరందకున్నాయన్నారు. నకిలీ మద్యాన్ని నియంత్రించి, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్సీపి డివిజన్ కార్యదర్శి మున్నా, రైతు సంఘం నాయకులు రామచంద్ర, మహిళా సంఘం నాయకులు శివమ్మ, కార్యకర్తలు శ్రీనివాసులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు పోస్టింగ్ ఇస్తారా ఇవ్వరా?

**అనంతపురం రూరల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
అనంత రూరల్ మండలం ఉప్పరపల్లిగ్రామపంచాయతీలో మీనాక్షి, రోహిణి, మోనిక, హరిత, సుకన్య, లక్ష్మి, సునీత, పుష్పావతి అని ఏడు మందికి ఆశా వర్కర్లుగా నియమించారు.అయితే రాజకీయ నాయకుల ఒత్తిడి వలన వారికి ఇంతవరకు సంబంధిత అధికారులు పోస్టింగ్ అనుమతులు ఇవ్వలేదు, వారికి పోస్టింగ్ అనుమతి ఇవ్వకపోవడంతో ఎంతకాలం ఈ విధంగా నాన్చుతారని తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరుగుతుంది, ఆ ఏడు మందికి సంబంధించిన అధికారులు పోస్టింగ్ ఇస్తారా ఇవ్వరా అనే ఎన్ని రోజులు ఈ విధంగా నానుస్తారని గ్రామంలోని ప్రజలు గుసగుసలాడుకోవడం జరుగుతుంది.

## ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే కందికుంట



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

**కదిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
కదిరి పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలల నుంచి సమస్యలను ఎమ్మెల్యే క్షుణ్ణంగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం అయ్యే సమస్యలను అధికారులను ఆదేశించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త ఉపాధ్యాయుడు విధుల్లో చేరిక



విధుల్లో చేరుతున్న నూతన ఉపాధ్యాయులు

**నంబులపూలకుంట, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
మండల పరిధిలోని రెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాలకు 2025 డీఎస్సీ ద్వారా ఎన్నికైన శివ కుమార్ విధుల్లోకి చేరారని ఎంఈఓ గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోపాల్ నాయక్ మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించావని, అంతే శ్రద్ధగా పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, వారి ఉజ్వల బయటకు బంగారు బాటలు వేయాలని తెలిపారు. వృత్తిలో అంకితభావంతో పనిచేసి మంచి ఉపాధ్యాయుడుగా గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు. అనంతరం ఎస్టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి నూతన ఉపాధ్యాయుల కోసం ఎస్టియు రూపొందించిన బుక్లెట్ ను ఉపాధ్యాయుడికి ఇచ్చి సర్వీస్ లో ఏ అవసరం ఉన్న సంఘం అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివయ్య, సందీప్, వెంకట్రామిరెడ్డి, హరి ప్రసాద్, హబీబుల్లా, రామ్మోహన్, పూర్ణానంద రెడ్డి, రమణయ్య మరియు ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## బోయ బాలచంద్ర కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీ, డీఎస్పీని కోరిన మన్నీల గ్రామ ప్రజలు



డీఎస్పీ మహబూబాసాకు వివరాలు తెలియజేస్తున్న మన్నీల గ్రామ ప్రజలు

**అనంతపురం రూరల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
అనంత రూరల్ మండలం మన్నీల గ్రామంలో అరాచకాలు సృష్టిస్తూ ఉన్నటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మన్నీల గ్రామ ప్రజలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే లో జిల్లా ఎస్పీకి, డి.ఎస్.పి మహబూబ్ బాషాకి వినతి పత్రం అందజేశారు. మన్నీల గ్రామంలో ఉన్న బోయ బాలు, కాటమయ్య బోయ జయరాం, కాటమయ్య బోయ ఈశ్వర్,కాటమయ్య బోయ శివ, భీమన్న బోయ బాలచంద్ర, ఈశ్వరయ్య ముష్టూరు బోయ అంజి సన్నాఫ్ రామప్ప మరియు వీరికి సంబంధించినటువంటి బంధువులతో మన్నీల గ్రామంలో ఏ క్షణమైనా ఏ ప్రమాదమైనా జరగవచ్చు మనీల గ్రామంలోకి రానివ్వకుండా మన్నీల గ్రామ ప్రజలను కాపాడాలని గ్రామ ప్రజలు కోరారు. అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామ పొలిమేర దగ్గర ముష్టూరు గ్రామానికి చెందిన లేట్ బోయ కాటమయ్య, ఈ రజి న్ను 100 సంవత్సరాల క్రితం ఐదు ఎకరాలు ప్రభుత్వ డి పట్టా భూమి ఇతరులతో కొనుగోలు చేసుకుని వీరి కుమారులు మనవళ్ళు అయినటువంటి వారు లేట్ బోయ భీమన్న, కాటమయ్య,బోయబాలు, కాటమయ్య బోయ జయరాం, కాటమయ్య బోయ ఈశ్వర సన్నాఫ్ కాటమయ్య బోయ శివ, భీమన్న బోయ బాలచందర్, ఈశ్వరయ్య వీరు ఇప్పుడు దౌర్జన్యంగా ప్రభుత్వము భూమిని దాదాపు 30 ఎకరాల వరకు ఆక్రమించుకోవడం జరిగింది వీరు అక్కడ అడుగు పెట్టినప్పుడు నుండి చుట్టూ ఉన్నటువంటి రైతులతో ప్రతిరోజు గొడవలు సృష్టించడం జరుగుతుంది వారిని ఎవరైనా నిలదీస్తే కొట్టడమే పనిగా పెట్టుకున్నా పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చిన తర్వాత కూడా మా పైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తారని ఇళ్ల మీదకు వచ్చి దాడి చేసినటువంటి సందర్భంలో ఉన్నాయన్నారు. వీరిపై జిల్లా వ్యాప్తంగా స్టేషన్ల పరిధిలో వీరిపైన అనే కేసులు ఉన్నాయన్నారు. మన్నీల గ్రామంలో ప్రత్యేకంగా సిఐ సమక్షంలోని విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని డీఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నగిరి ఆదిశేషు, అల్లు షేక్షావలి నాయుడు,అల్లురామాంజనేయులు,,వర్గప్రసాదు,,రామాంజనేయులు,అన్నగిరి శంకరయ్య, నాగమణి,, లక్ష్మీదేవి,, నాగలక్ష్మి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షునికి సన్మానం

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



శ్రీనివాసనాయక్‌ను సన్మానిస్తున్న మిత్రులు

ఆల్ ఇండియా బంజార సేవ సంఘ్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సభావత్ శ్రీనివాస్ నాయక్‌కు సోమవారం మిత్రులు ఘనంగా సన్మానించారు. పైపల్లి గంగాధర్, సోదినపల్లి రావమాంజినేయులు, ఓబుల్‌కుమార్ తదితరులు శ్రీనివాస నాయక్‌పై శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియచేశారు.

## విద్యార్థి అదృశ్యం

**అనంతపురం రూరల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త**
అనంతపురం రూరల్ మండలంకొడిమి దర్గా కొట్టాలుకు చెందిన 3వ తరగతి విద్యా ర్థి కనిపించడం లేదు. ఈ మేరకు అనంతపురం రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే కొడిమి దర్గా కొట్టాలుకు చెందిన వేణు పాత సామాన్లు ఏరుకుంటూ వాటిని గుజరీకి వేయడం ద్వారా జీవనం సాగించే వాడు. ఈయన మూడో కుమారుడు రామాంజనేయులు 3వ తరగతి ఉరవకొండలోని హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నారు. ఈ నెల 11న తమ్ముళ్లను ఉరవకొండకు వదిలేందుకు ఈశ్వర్, పిలుచుకెళ్తుండగా తాను ఇంటికి వెళతానంటూ రామాంజనేయులు ఏడ్వడంతో రాచానపల్లి వద్ద బస్సులో నుంచి దించేసి వెళ్లారు. ఈశ్వర్, సాయంత్రంఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు విషయం తెలపడంతో కంగారుపడిన వారు రామాంజనేయులు కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం వేణు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు అనంతపురం రూరల్ సి ఐ శేఖర్ తెలిపారు.

# ధర్తీ అబ జన్ జాగృతి ఉత్కర్ష అభియాన్ పనులు ప్రారంభించండి

### -జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కోరిన బంజారా జాతీయ నేత ఎస్.కె.కేశవనాయక్

**ఉరవకొండ, అక్టోబర్ 13 ప్రభాతవార్త**


జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసిన బంజారా సంఘం జాతీయ నాయకులు ఎస్.కె.కేశవనాయక్ తదితరులు

ధర్తీ అబ జన్ జాగృతి అత్కర్ష అబియాన్ పనులను వెంటనే ప్రారంభించాలని బంజారా సంఘం జాతీయ నేత ఎస్.కె.కేశవనాయక్ జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కోరారు. సోమవారం జిల్లా కేంద్రం అనంతపురంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి షాలువాకప్పి సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.కె.కేశవనాయక్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రారంభించిన ధర్తీ అబజన జాగృతి ఉత్కర్షఅభియాన్ పథకంకింద ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరుమండలం రూపానాయక్‌తండా, వెంకటాంపల్లి చిన్నతండాను ఎంపిక చేశారని అయితే ఏడాది కాలం గడుస్తున్నప్పటికీ తండాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదన్నారు. జిల్లాస్థాయి అధికారులు రెండుసార్లు సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసినా నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. రూపానాయక్ తండాను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటుచేయాలని, టూరిజంశాఖద్వారా కళ్యాణ మండలం నిర్మించాలని, సీసీ రోడ్లు నిర్మించి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షణకై వేషదారణ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిని నిర్మించి తాగునీటి సమస్యకు శాశ్విత పరిష్కారం చేయాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి కే ంద్రమే ప్రత్యేక పింఛన్ మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఆర్డీటీ ద్వారా నిర్మించిన చెరువుల్లో చేపల పెంపకం చేపట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరినా కదలిక లేదన్నారు. పథకంలో పొందుపర్చిన 22 అంశాలు, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి గిరిజనాభివృద్ధికి పాటుపడాలని ఈసందర్భంగా కలెక్టర్‌ను కోరినట్లు ఎస్.కె.కేశవనాయక్ వివరించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సేవాగడ్ ప్రధాన అర్చకులు మారుతి ప్రసాద్, బంగి దుర్గ తదితరులు ఉన్నారు.

# 17న ఉరవకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

### -మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్

**ఉరవకొండ, అక్టోబర్ 13 ప్రభాతవార్త**


ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్

ఉరవకొండ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షులు అధ్యక్షతన జరుగుతుందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్ సోమవారం తెలిపారు. సమావేశానికి మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచులు, అన్నిశాఖల మండలస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులందరూ తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఏ4 సైజు పేపర్‌లో 25 ప్రతులు కార్యాలయంలో 15వ తేదీ లోగా అందించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ-పౌర సరఫరాలు, త్రాగునీరు, ప్రాథమిక విద్య, విద్యుత్, వైద్యం-ఆరోగ్యం, వ్యవసాయం, సూక్ష్మనీటి పారుదల (ఏపీఎంఐపీ), రవాణా, స్త్రీ శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్, ఉద్యానశాఖ, పశు సంవర్ధకశాఖ, చిన్ననీటి పారుదల, వెలుగు, రోడ్డు, భవనాలు, గృహనిర్మాణశాఖ, వాటర్ షెడ్స్, ఎక్సైజ్, దేవాదాయ, ధర్మాదాయశాఖలతో పాటు అధ్యక్షులు అనుమతితో వివిధ అంశాలను చర్చించడం జరుగుతుందని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ వివరించారు.

# ఎన్-బ్రాండ్ కల్తీ మద్యం నిలిపివేయాలి..!

### - ప్రభుత్వానికి వ్యతిరేకంగా, వైయస్సార్సీపి ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన

**చెన్నేకొత్తపల్లి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



ఎన్ బ్రాండ్ల కల్తీ మద్యం నిలిపివేయాలని నిరసన తెలియజేస్తున్న వైఎస్ఆర్‌సిపి నేతలు

మద్యం మాఫియా రాజ్యం, ప్రజల ప్రాణాలను హరిస్తున్న నారావారీ కల్తిమద్యం, నిలిపివేయాలని అని వైఎస్సార్‌సిపి నాయకులు, యువజన రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి యువజన రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి వైఎస్సార్‌సిపి రాప్తాడు నియోజకవర్గ నాయకులతో కలసి చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌కి వినతి పత్రం అందజేసి, ఎక్సైజ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా స్థానిక బస్టాండ్ సర్కిల్ నుంచి ఎక్సైజ్‌స్టేషన్ వరకు నారావారి మద్యాన్ని వెంటనే నిలిపివేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. సందర్భంగా యువజన రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో ఎన్-బ్రాండ్ కల్తీ మద్యం తాగుతూ ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. ఎన్-బ్రాండ్ కల్తీ మద్యం నిలిపివేయాలని, రాష్ట్రంలో మద్యం షాపులతో పాటు ప్రతి ఊరిలోనూ వెలిసిన బెల్ట్‌షాపుల్లో నకిలీ మద్యాన్ని అమ్ముతూ ప్రజల మాన ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. వైయస్సార్సీపి రాప్తాడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో టిడిపి నాయకుల కనుసన్నుల్లోనే ఈ నకిలీ మద్యం దందా సాగుతోందన్నారు. ప్రభుత్వమే నకిలీ మద్యాన్ని ప్రోత్సహించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు అమర్నాథ్‌రెడ్డి, యువజన జిల్లా అధ్యక్షులు సుధీర్ రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, చెన్నేకొత్తపల్లి వైఎస్ఆర్సిపి మండల్ కన్వీనర్ డోలా రామచంద్ర రెడ్డి, ఎంపీపీ మజ్జిగ అంజలి, చెన్నేకొత్తపల్లి మహిళా అధ్యక్షురాలు రజిని, ఎస్.టి.డి శ్రీనివాస్ రెడ్డి, ప్యాదిండి నరసింహారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా విజయకుమారి

**అగళి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**


పదవీ బాధ్యతలు చేపడుతున్న ప్రిన్సిపాల్ విజయకుమారి

అగళి ఆదర్శ పాఠశాల నూతన ప్రిన్సిపాల్‌గా విజయకుమారి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎల్లప్పుడు విద్యార్థులకు, స్టాఫ్‌కు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. అదే విధంగా 2025 డిఎస్సీలో మంచి మార్కులు సాధించి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియామకం అయ్యారు. మరో ఉపాధ్యాయురాలు కరిశ్మ టిజిటి బయాలజీ సైన్స్ టీచర్‌గా ఆదర్శ పాఠశాలలో చేరారు.

# సూపర్ జీఎస్టీ పై అవగాహన పెంపొందించుకోవాలి

### జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ సి. సూర్యనారాయణ

**పుట్టపర్తి (కల్చరల్), అక్టోబరు 13, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" తో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, దీనిపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ సి. సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి సత్యమ్మ గుడి వరకు లేబర్ డిపార్ట్మెంట్, కామర్స్, పరిశ్రమలు మరియు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలపై అధికారులు ప్రజలకు వివరించారు. అనేక వస్తువులపై జీఎస్టీ ని 18 నుండి 5 శాతం మాత్రమే అమలు చేయడం వల్ల ప్రతినెల ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారి కే.నరేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, సీఐ శివాంజనేయులు, బైక్ ర్యాలీలో పాల్గొన్న గిగ్ వర్కర్లు, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి జిల్లా కు కొత్త జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

**శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము)**

**అక్టోబర్ 13 ప్రభాతవార్త:**


నూతన ఇమ్యునైజేషన్ అధికారి సురేష్ బాబు

విజయవాడ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న డా. కె. సురేష్ బాబు పదోన్నతి పొందగా, శ్రీ సత్యసాయి జిల్లా కొత్త జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా నియమితులయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఫైరోజా బేగం ని మర్యాదపూర్వకంగా కలసిన అనంతరం, ఇది వరకూ ఇంచార్జి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన డా. నాగేంద్ర నాయక్ నుండి డా. ఫైరోజా బేగం సమక్షంలో డా. సురేష్ బాబు అధికార బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా డా. సురేష్ బాబు మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి , ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు మరియు ఆరోగ్య సిబ్బంది అందరి సహకారంతో సార్వత్రిక వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తాను అని తెలిపారు.

# రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలని తహసిల్దార్ కు విన్నపం

**అమరాపురం అక్టోబర్ 13 ప్రభాతవార్త**


తహసిల్దార్ తో చర్చల దృశ్యం

మండల పరిధిలో బసవనపల్లి రెవెన్యూ గ్రామపంచాయతీలోని ప్రధానంగా ఉన్న రెవిన్యూ సమస్యలను పరిష్కరించాలని అమరాపురం తహసిల్దార్ లక్ష్మీనరసింహం కు ,టిడిపి యువ నాయకుడు మండల క్లస్టర్ కో కన్వీనర్ మంజు తారక్ సోమవారం గ్రీవెన్స్ సెల్ ద్వారా విన్నవించారు. ఏండ్ల తరబడి ఉన్న అనేక రెవెన్యూ సమస్యలు సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా మోటేషన్ మరియు విభాగపు సమస్యలు సర్వే సమస్యలు అధికంగా ఉన్నాయని ఆయన తహసిల్దార్ కు తెలియజేశారు. తక్షణం సమస్యలపరిష్కారానికి స్థానికరెవిన్యూ అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తహసిల్దార్ తెలియజేశారు.

# అదుపుతప్పిన ఆటో డ్రైవర్ కి స్వల్ప గాయాలు

**వజ్రకరూర్ అక్టోబర్ 13 ప్రభాతవార్త**


రోడ్డు పక్కన ఉన్న పొలంలోకి వెళ్లిపోయిన ఆటో

జరట్ల రామపురం పందికుంట రహదారిలో పందికుంట గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి పక్కన ఉన్న పొలాల్లోకి వెళ్లిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఉరవకొండ నుండి వెంకటం పల్లి పెద్ద తండా(రూపా నాయక్ తండా)కు పొట్టేళ్లతో పాటుఇద్దరు మనుషులతో ఆటో వస్తుండగా ఆటో అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న పొలాల్లోకి రోడ్డుకి పొలానికి సుమారు మూడు అడుగుల మేర వ్యత్యాసం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో ఆటోను బయటకు తీశారు ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పిల్చుకున్నారు.

# వర్షానికి తడిసి కూలిన ఇల్లు

**బత్తలపల్లి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**


కూలిపోయిన ఇల్లు

ఇటీవల కురిసిన వర్షాలకు నీరు దిగి ఇల్లు ఒక్కసారిగా కూలిబడి పోయిన సంఘటన మండలంలోని చీమలనాగేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు రామిరెడ్డి తెలిపిన సమాచారం మేరకు ఖీగ్రామానికి చెందిన రామిరెడ్డి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత రెండు రోజులు క్రితం కురిసిన భారీ వర్షానికి ఇల్లు కారుతూ నీరు దిగి కూలిపోయినట్లు తెలిపారు. అయితే ఆ సమయంలో ఇంటిలో ఎవ్వరూ లేకపోవడం వల్ల ప్రాణాపాయం తప్పింది. ఇంటిలోని సామాగ్రి, బీరువా, మంచాలు, సామాన్లు, బియ్యం తదితర వాటని నష్టపోయినట్లు తెలిపారు. తద్వారా రూ.1లక్ష ఆస్థి నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**గుడిబండ అక్టోబర్ 13 ప్రభాతవార్త**

మండలంలోని కొంకల్లు గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి కుల బాంధవులు బంధుమిత్రులతో మహిళలతో పూల హారతులు నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి వేటగాడు నుండి మహర్షిగా ఎదిగిన తీరును గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు,ఓబన్న, నాగరాజు, శివకుమార్, సోమశేఖర్,ఈరన్న తదితరులు పాల్గొన్నారు.


పూల హారతులతో మహిళలు

# నకిలీ మద్యంపై సిబిఐ చేత దర్యాప్తు చేయించాలి

### బెల్ట్ షాపులు రద్దు చేయాలి.

**మడకశిర టౌన్ అక్టోబర్ 13 ప్రభాతవార్త.**


సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా పార్టీ ఇన్చార్జి ఈరలక్కప్ప.

ములకలచెరువు వద్ద నకిలీ మద్యం తయారీపై ప్రభుత్వమే సిబిఐ చేత దర్యాప్తు చేయించాలని ఇంచార్జ్ ఈరలక్కప్ప, జిల్లా అధికార ప్రతినిధి ఆనందంగా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైకాపా పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నకిలీ మద్యంపై ఆందోళనలో భాగంగా స్థానిక వైకాపా నాయకులు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ కల్లుమర్రి శ్రీరాములు,, నరసింహారెడ్డి తదితరులు పాల్గొని వైయస్సార్ సర్కిల్ నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీగావెల్లి ఎక్సైజ్‌స్టేషన్‌ముందు బైఠాయించి నిరసనచేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాష్ట్రాన్ని నకిలీ మద్యంధ్ర ప్రదేశ్ గా మార్చారని పేర్కొన్నారు. ఇంచార్జ్ ఈరలక్కప్ప మాట్లాడుతూ: నకిలీ మద్యంపై రాష్ట్రవ్యాప్తంగా వైకాపా పార్టీ ఆందోళన చేపడుతుందని పేర్కొన్నారు. తక్షణం బెల్ట్ షాపులను రద్దుచేసి విచ్చలవిడి అమ్మకాన్ని నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు జిల్లా అధికార ప్రతినిధి ఆనందంగా రెడ్డి మాట్లాడుతూ: ప్రస్తుతం రాష్ట్రంలో నకిలీగుట్టు రట్టైన మొలకలచెరువు ఇబ్రహీంపట్నం సంఘటన దృష్టిలో పెట్టుకొని సిబిఐ చేత దర్యాప్తు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు అంతేకాకుండా మడకశిర పట్టణంలో నాలుగు షాపులు మంజూరు అయితే కేవలం రెండు షాపులకు మాత్రమే నిర్వహిస్తూ మిగిలిన షాపులను నిర్వహింప చేయకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అంతే కాకుండా బెల్ట్ షాపులను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఒకవేళ ప్రభుత్వం నోటిఫికేషన్ వేసిన దుకాణానికి ఎవరు రాకపోతే అలాంటి దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల్సింది పోయి అధికార పార్టీ నేతలకు ఆదాయ మార్గాలుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం విచ్చలవిడిగా చలామణి అవుతుందని అంతేకాకుండా బెల్ట్ షాపుల గ్రామ గ్రామాల్లో ఎత్తేచగా అమ్ముతూ ఉండడం వల్లనే నకిలీ మద్యం జోరందుకోవడానికి అవకాశం ఉంటుందని వెంటనే లైసెన్స్ కలిగిన చోట తప్ప మరోచోట ప్రభుత్వ మద్యం కూడా అమ్మకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యంపై వైకాపా పార్టీ నిరంతరం పోరాటం చేస్తుండని కూడా ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. నకిలీ లిక్కర్ తో నకిలీ మద్యాంధ్రప్రదేశ్ గా ఏపీ మారిపోయింది అని పేర్కొన్నారు. బడులు, గుడులు పబ్లిక్ ప్లేసులలో ఏర్పాటుచేసిన వైన్ షాపులు బార్ల లైసెన్సులను రద్దు చేయమని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఎక్సైజ్ ఆఫీసర్ కు వినతిపత్రం అందజేసి డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో మధు,మల్లికార్జున, కన్వీనర్‌సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఆర్ పై విద్యార్థులకు అవగాహన

**రొళ్ల అక్టోబర్ 13 ప్రభాతవార్త:**



సిపిఆర్ పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ బాల ప్రణీత్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సిపిఆర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హృదయ స్పందన, చాతి నొప్పి వచ్చినప్పుడు, ఛాతి భాగంలో బిగుతుగా నొప్పి ఏర్పడినప్పుడు చేయవలసిన ప్రథమ చికిత్స విద్యార్థులకు క్లుప్తంగా ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ సభ్యులు రమేష్ గౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# వేరుశనగ పంటలో పంటకోత ప్రయోగాలు

**బత్తలపల్లి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**


పంట కోసం ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

మండలమంలోని ఓబుళపురం గ్రామములో అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ ప్రయోగం సర్వే నంబర్ 3106 కృష్ణ మూర్తి పొలంలో 55 మీటర్ల కొలతలతో నిర్వహించారు. ఈ పందు కోత ప్రయోగంలో దిగుబడి 3కేజీల 470గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ పంట కోత ప్రయోగమును ఏ ఎస్ ఓ కె ఎస్ ఎల్ ఎన్ శర్మ నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నాగార్జున మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రాయల రాజ్యం తెచ్చిన వ్యక్తి కృష్ణదేవరాయలు... జయంతి వర్ధంతి వేడుకలు ప్రభుత్వం నిర్వహించాలి

### -గోరంట్ల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన మండల బలిజ సోదరులు

**గోరంట్ల, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

విజయనగర సామ్రాజ్య రారాజు శ్రీకృష్ణదేవరాయలు జయంతిని మరియు వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని తహశీల్దార్ మారుతిప్రసాద్‌కు మండల బలిజ సోదరులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సాహిత్యం, కళలు, విద్యా రంగాలలో అపార కీర్తి తెచ్చిన మహానుభావుడు శ్రీకృష్ణదేవరాయలు అని దేశానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన పాలనలో ప్రజలకు శాంతి, సమృద్ధి, విద్య, వైద్యం, కళలకు విలువ లభించాయన్నారు. వేల చెరువులను, తటాకాలను, గుళ్లను గోపురాలను నిర్మించిన దక్షిణాది భారతదేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించిన మహానుభావుడని అని అభివర్ణించారు. అటువంటి మహానుభావుడి జయంతిని మరియు ఆయన వర్ధంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించడం ద్వారా యువతకు స్ఫూర్తి లభిస్తుందన్నారు. అందుచేత ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలోనే కాక జిల్లా స్థాయిలోనూ మరియు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు టింబర్ డిపో గంగాధర్, పులేరు సోమశేఖర్, చుండూరు నరేంద్రరాయల్, గుంటిపల్లి నగేష్, సర్పంచు నరసింహమూర్తి, సంతోష్‌కుమార్, కమలాకర్, కిషోర్, పులేరు పొగాకు హరి, చిన్నా రాయల్, చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు, గాజుల రమేష్, సుందరేష్, బూదిలి శ్రవణ్, బాలు, గుంటిపల్లి తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**గుంతకల్లు, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను సోమవారం స్థానిక క్యాంపుకార్యాలయంలో ఎమ్మెల్యేగుమ్మనూరు జయరాం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 7 మందికి గాను 14.76 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రారంభమైన హంద్రీనీవా కాలువ పనులు

### కృష్ణ జలాలు నింపడమే ప్రధాన లక్ష్యం

**అమరాపురం అక్టోబర్ 13 ప్రభాతవార్త**


పనులు ప్రారంభమైన దృశ్యం

అమరాపురం చెరువుకు కృష్ణ జలాలను తీసుకురావడమే లక్ష్యంగా హంద్రీనీవా కాలువ పనులు ప్రారంభమైనాయి. మండల పరిధిలోని చిట్టనడుకు గ్రామ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువలో పెరిగిన కంపచెట్లను మరియు మట్టిని తొలగించే కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యంగా కృష్ణ జలాలను అమరాపురం చెరువునకు తీసుకొని రావడమే ప్రధాన లక్ష్యంగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు కృషి చేస్తున్నారు. ఎన్నోఏండ్లుగా హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువుకు కృష్ణ జలాలను తీసుకుని వచ్చి రైతులకు అన్ని విధాల ఆదుకుని చేయూతనివ్వాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడానికి హంద్రీనీవా ముఖ్య అధికారుల పర్యవేక్షణతో కృష్ణ జలాలతో అమరాపురం చెరువును నింపి జల హారతి నిచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా చేపట్టాలని ప్రధాన లక్ష్యంతో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై పనులు శరవేగంగా చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అమరాపురంప్రాంతంలో అత్యధికంగా వక్క తమలపాకు తోటల తోపాటు చెరువు ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాల భూముల సాగుకు కృష్ణ జలాలు నింపడం ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కృష్ణా జలాల ద్వారా అమరాపురం చెరువు నింపితే ఈ ప్రాంతంలోసాగునీరు, త్రాగునీరు బోర్లలో సమృద్ధిగా నీరు లభిస్తుందని అమరాపురం ప్రజలు, రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జరుగుతున్న పనులను టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగల్ విండో అధ్యక్షుడు గణేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి ,సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, దాదాపీర్ ,జెడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తి, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు, మండల క్లస్టర్ కన్వీనర్ లునవీన్ కుమార్, కృష్ణమూర్తి, మండల క్లస్టర్ కో కన్వీనర్ లు మంజు తారక్, చెన్నప్ప, యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్ తదితరులు పనులు ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత రైతుల కల నెరవేర్చడానికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వ అధినేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# డాక్టర్లకు మద్దతుగా నల్ల బ్యాడ్జీలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఉద్యోగస్తులు


నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**బెలుగుప్ప, అక్టోబర్ 13 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 10 రోజుల నుంచి రిలే నిరాహార దీక్ష చేస్తున్న డాక్టర్లకు మద్దతుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగస్తులు, పారా మెడికల్ ఉద్యోగస్తులు నల్ల బ్యాడ్జీలను ధరించి డాక్టర్లకు మద్దతు తెలిపారు. అనంతరం వారితోపాటు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే డాక్టర్లకు వారి డిమాండ్లను ఒప్పుకుని ఆరోగ్య కేంద్రాలను వైద్యులు వచ్చే విధంగా చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ విజయ్‌కుమార్, సిహెచ్ఓ పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటరమణ, రాంబాబు, భువనేశ్వరి, గంగమ్మ, నర్సులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ మద్యం అరికట్టాలని వైకాపా ధర్నా

**గుత్తి, అక్టోబర్ 13 ప్రభాతవార్త**


ఎక్సైజ్ స్టేషన్ వద్ద వైకాపా ధర్నా చేస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం కారణంగా పలువురు మృతి చెంది కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని నిరసిస్తూ సోమవారం స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఎదుట వైకాపా ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. గాంధీ చౌక్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపిపి విశాలాక్షి, మహిళా విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు వరలక్ష్మియాదవ్, తదితరులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనధికారికంగా 90 వేలకు పైగా బెల్ట్‌షాపులు నిర్వహించి ప్రజల ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. నాణ్యమైన మద్యం అందిస్తామని హామీ ఇచ్చి, కల్తీ మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని వారు ఆరోపించారు. అనంతరం సిఐ ఉమాదేవికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్లు హుస్సేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ రాజ్‌విభాగం రాష్ట్ర కార్యదర్శి సివి రంగారెడ్డి, కౌన్సిలర్లు శివ, వరదరాజులు, రమణ, నరేష్, మున్సిపల్‌కోఆప్షన్ మైనుద్దీన్,నాయకులు గురుప్రసాద్ యాదవ్, సుభాష్‌రెడ్డి, వైపి బాబు, రంగస్వామి, రాజశేఖర్‌రెడ్డి, ఫయాజ్, డాక్టర్ శాంతిప్రియ, తోట శ్రీదేవి, హేమలతరెడ్డి, చంద్ర, రామాంజి, ఎంపిటిసి ఈరన్నగౌడ్, లావణ్య, లక్ష్మీదేవి, కరిష్మా, సుగుణ, అన్వర్, మున్నా, మహమ్మద్‌షఫీ, మల్లికార్జున, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

